క్లుప్తంగా

నేడు లోకోస్ యాప్‌పై శిక్షణ

కెరమెరి: మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు 'లోకోస్' యాప్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఎం జగదీశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ఇందిరా క్రాంతి పథం, మండలసమాఖ్య సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, వీవోఏలు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

నర్సరీ పరిశీలన

కెరమెరి: మండల కేంద్రంలో కొనసాగుతున్న నర్సరీ పనులను బుధవారం ఉపాధిహామీ పథకం ఏపీవో మల్లయ్య పరిశీలించారు. బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తయిన తర్వాత వెంటనే విత్తనాలు వేయాలన్నారు. నాణ్యమైన మట్టి వినియోగించాలని సూచించారు. ప్రతీరోజు మట్టితో నింపిన స్టంపుల్లో నీళ్లు పోయాలన్నారు. ఆయన వెంట టీఏ నాగోరావు ఉన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

కెరమెరి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 29న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి జెడ్పీటీసీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు ఆయా శాఖల అధికారులు తగు నివేదికలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న అయ్యప్ప స్వాములు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో అయ్యప్ప దీక్షా స్వాములు అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలతో బుధవారం నగర సంకీర్తన చేశారు. ఆలయంలో అయ్యప్ప మహామండల పడిపూజ పురస్కరించుకొని ఉదయం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి పురవీధుల గుండా అయ్యప్పస్వామి ఆలయం వరకు భక్తి కీర్తనలు, అయ్యప్ప నామస్మరణతో నగర సంకీర్తన చేశారు. అనంతరం అయ్యప్ప ఆలయంలో అర్చకులు నాగేశ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిర్పూర్ జెడ్పీటీసీ కోవ అరుణ, భర్త సోనేరావు, తనయుడు సాయినాథ్, గురుస్వాములు పాల్గొన్నారు.

బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు సీట్లు కేటాయించాలి

కాగజ్‌నగర్‌టౌన్: ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్ల కోసం 10 సీట్లు రిజర్వు చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ పంపినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపుగా 40 లక్షల వరకు సీనియర్ సిటిజన్లు ఉన్నారని, బస్సుల్లో నిలబడే శారీరక శక్తి లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీఎం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పూర్ణచందర్, నారాయణ, కె.రమణయ్య, ఎల్లాగౌడ్, వాహబ్, మూర్తి, దేవయ్య, గంగాధర్, బంగారు బాబు, ఉపేందర్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఆర్థిక సాయం



ప్రయాణ చార్జీలు అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధర్వంలో కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత కంటి ఆపరేషన్ల కోసం ఎంపికైన రోగులకు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ కొత్తపల్లి అనితల ఆధ్వర్యంలో ప్రయాణ, భోజన అవసరాల నిమిత్తం మున్సిపల్ కమిషనర్ అంజయ్య చేతుల మీదుగా ఆర్థిక సాయాన్ని అందించారు. ఇందులో భాగంగా 15 మందిని ఆపరేషన్ నిమిత్తం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలి



మాట్లాడుతున్న అబ్దుల్ ముబీన్

కాగజ్‌నగర్‌టౌన్: ఈనెల 28 నుంచి ప్రజాసంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల కోసం అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు నిర్ధారించిన సమయంలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ముబీన్ విజ్ఞప్తి చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ప్రజా పాలన కార్యక్రమాన్ని గ్రామాల వారీగా అధికారులు నిర్వహించనున్నారని, ప్రజాపాలన గ్రామసభల్లో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జోరుగా వరి సాగు!

- సన్నరకం పైనే రైతుల ఆసక్తి
- వేధిస్తున్న కూలీల కొరత



రెబ్బెనలో నాట్లు వేస్తున్న కూలీలు

రెబ్బెన: మండలంలో యాసంగి పంటల సాగు పనులు ఊపందుకున్నాయి. వానాకాలం వరి పంటల కోతలు పూర్తి కాగానే రైతులు యాసంగి సాగుపై దృష్టి పెట్టారు. 25 రోజుల క్రితమే వరినార్లు పోయగా ప్రస్తుతం నాట్లు వేసేందుకు అనుకూలంగా నారు పెరగడంతో రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. ముందస్తుగా నార్లు పోసిన ప్రాంతాల్లో నాట్లు సైతం పూర్తి కాగా చాలా మంది రైతులు ఇప్పుడిప్పుడే నాట్లు వేసే పనుల్లో బిజీగా మారారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ సారి యాసంగి వరిసాగు కాస్త పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే పనులు చేసేందుకు కూలీలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

2100 ఎకరాల్లో వరిసాగు..

ఈసారి యాసంగిలో మండలంలో 2100 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బోరు మోటర్లు, వాగు మోటర్లుతో పాటు వట్టివాగు ప్రాజెక్టు కాలువ కింద వరిసాగు పనులు కొనసాగుతున్నాయి. మండలంలోని రెబ్బెన, నంబాల, కొమురవెల్లి, నారాయణపూర్, కిష్టాపూర్, ఫకీర్‌పల్లి, తక్కళ్లపల్లి ప్రాంతాల్లో బోరు మోటర్ల కింద వరిసాగు చేపడుతుండగా, పుంజుమేరగూడ, నక్కలగూడ, ఖైరిగాం, ఎడవెల్లి ప్రాంతాల్లో రైతులు బోరు మోటర్లు, వట్టివాగు కాలువ నీటితో వరిసాగు చేపడుతున్నారు. గత సంవత్సరం యాసంగిలో 2089 ఎకరాల్లో వరిసాగు చేపట్టగా ఈసారి 2100 వరకు పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

జోరందుకున్న పనులు..

మండలంలో యాసంగి వరిసాగు పనులు జోరందుకున్నాయి. ముందస్తుగా నార్లు పోసుకున్న రైతులు ఇప్పటికే వరినాట్ల ప్రక్రియ సైతం పూర్తి చేసుకున్నారు. రెబ్బెన, నక్కలగూడ, పుంజుమేరగూడ, కొమురవెల్లి ప్రాంతాల్లో కొంతభాగం వరినాట్లు సైతం పూర్తయ్యాయి. వరికోతలు కాస్త ఆలస్యమైన ప్రాంతాల్లో రైతులు ఇప్పుడిప్పుడే నాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పొలాలను దమ్ము చేయడంతో పాటు వరిగట్లపై పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. నాట్లు వేసేందుకు కొన్ని ప్రాంతాల్లో నారు సిద్ధంగా ఉన్నా కూలీల కొరతతో పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో పూర్తిస్థాయిలో పత్తి ఏరే పనులు పూర్తి కాకపోవటంతో కూలీలు పత్తి ఏరే పనుల వైపే మొగ్గు చూపుతున్నారు.

సన్నాల సాగుకు మొగ్గు..

సాధారణంగా వానాకాలంలో రైతులు సన్నరకం వరిని సాగు చేస్తే యాసంగిలో మాత్రం దొడ్డురకం వరి సాగు చేపట్టేందుకు ఆసక్తి చూపుతారు. సన్నరకం పంటకాలంతో పోల్చితే దొడ్డురకం వరిసాగు పంటకాలం తక్కువగా ఉండటంతో పాటు దొడ్డు రకం వరిసాగులో చీడపీడలు, తెగుళ్ల బెడద కాస్త తక్కువగా ఉంటుంది. అయితే వానాకాలంలో సన్నరకం వరిధాన్యానికి రైతులు ఆశించిన ధర లభించటంతో పాటు తేమ శాతంతో పని లేకుండా కోత పూర్తయిన రోజే కాంటా వేయటంతో రైతులంతా యాసంగిలోనూ సన్నరకం వైపే మొగ్గు చూపుతున్నారు. వానాకాలంలో సన్నరకాలు తెలంగాణ సోనా, సూపర్ అమన్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ. 2400 నుంచి రూ.2600 వరకు చెల్లించి ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇక జైశ్రీరాం, సాయిరాం, చిట్టి ముత్యాలు వంటి సన్నరకం ధాన్యానికి కనిష్టంగా రూ. 2600 నుంచి గరిష్టంగా రూ.3200 వరకు చెల్లించారు. ఈసారి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటంతో తీవ్ర జాప్యం జరగడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. సన్నరకాలను సాగు చేస్తే ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకునే అవకాశం ఉండటంతో రైతులు సన్నరకం సాగుకే మొగ్గు చూపుతున్నారు.

ఆశాజనకంగా సాగు..

ఈ సారి మండలంలో యాసంగి పంటల సాగు ఆశాజనకంగా ఉంది. యాసంగిలో మండలంలో అత్యధికంగా వరి సాగవుతుంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు కూడా పూర్తయ్యాయి. చాలామంది రైతులు నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల కొన్ని రోజుల పాటు వాతావరణంలో ఏర్పడిన మార్పులు, అధిక చలి తీవ్రతతో వరినారు పెరుగుదలపై కొంత ప్రభావం పడింది.

- శివ, వ్యవసాయ విస్తరణ అధికారి

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

సిర్పూర్(టి): ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని నవేగాం గ్రామంలో గల శివసాయి గణేశ్ ఆలయంలో నిర్వహించిన దత్త నవరాత్రుల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆలయంలో దత్త నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నవేగాం నుంచి ఆలయం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు నీరటి సత్యనారాయణ, నేరెళ్ల అశోక్, వడ్డేటి నానయ్య, ఎల్ములే శంకర్, నులిగొండ మహేశ్, మారుతి, బనార్కర్ సాయి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్‌లో గల శ్రీ వేంకటేశ్వర స్వామి, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలను సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు దర్శించుకున్నారు. బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు హరీశ్ బాబుతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించారు.

బెంగాలీలకు న్యాయం చేయాలి

కౌటాల: నియోజకవర్గంలోని బెంగాలీలకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని కేంద్ర మంత్రి శంతను ఠాకుర్‌కు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు బుధవారం వినతిపత్రం అందించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బెంగాలీలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇప్పించడంతో ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జాతీయ వెనుబడిన తరగతుల కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాంను చంద్రపూర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చే ప్రక్రియకు తుదిరూపు ఇవ్వాలని కోరారు. నాయకులు బిశ్వాస్, బికాశ్, సమీర్, మిథున్, రాకేశ్, మహేశ్ ఉన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



పట్నాపూల్‌లో ధ్యానం చేస్తున్న భక్తులు

జైనూర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ బాబా బోధనలు అనుసరించాలని మహారాష్ట్ర ఉమ్మర్‌ఖేడ్ ఎమ్మెల్యే ఉత్తమ్‌రావు ఇంగిళే అన్నారు. బుధవారం మండలంలోని పట్నాపూర్ సిద్ధేశ్వర సంస్థాన్‌లో పరమహంస సద్గురు పూలాజీబాబా సమాధి సోహళా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా బాబా సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్ర భక్తులు ఎంతో మందిని మద్యం, మాంసం వీడి ఆధ్యాత్మికత వైపు మళ్లించిన ఘనత బాబాకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగిళే, కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల పాట్లు



ఆర్టీసీ బస్సులో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో జిల్లాలో బస్సులు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో అధిక సంఖ్యలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. బుధవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, కాగజ్‌నగర్ రూట్లతో సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మధ్యాహ్నం మంచిర్యాల -ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రూట్‌లలో మహిళలు, ప్రయాణికులు రోడ్డుపై గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. అప్పటికే బస్సుల్లో తీవ్రంగా రద్దీ ఉండడంతో పలు స్టేజీల్లో బస్సులు ఆపకుండానే వెళ్లాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా అయోధ్య అక్షింతల శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

బెజ్జూర్: అయోధ్య శ్రీరామాలయ అక్షింతల స్వాగతోత్సవ శోభాయాత్రను మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేసి గ్రామస్తులు శోభాయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర మండల కేంద్రంలోని వీధుల గుండా సాగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్రా మనోహర్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేశ్, కొండవీటి భాస్కర్‌రాజు, పాల్వాయి శ్రావణ్, నిలేష్, వెంకట్, నరేందర్, శ్రీను, లింగయ్య, బాలకృష్ణ, సంతోష్, తిరుపతి, అయ్యప్ప స్వాములు, మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

కౌటాల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చింతలమానెపల్లి కేజీబీవీ ఏఎస్‌ఎం డి.దుర్గాబాయి కుటుంబాన్ని టీఎస్‌యూటీఎఫ్ సభ్యులు మండలంలోని శివాలింగపూర్ గ్రామంలో పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి సంఘం ఆధ్వర్యంలో రూ. 33 వేల ఆర్థిక సాయం అందించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావు, సభ్యులు ఊశన్న, దుర్గయ్య, సఫల్, పవిత్ర, అనిత, శిరిష పాల్గొన్నారు.

మంచే.. మసకేసిందిలే!



అడవిని కప్పేసిన పొగమంచు



పంట పొలాలపై..



రోడ్డుపై..

కెరమెరి మండలంలోని పిట్టగూడ, టేకెన్‌మోవాడ్, పాటగూడ, బాబేఝరి, లైన్‌పటార్ గ్రామాల్లో బుధవారం మంచు కప్పేసింది. ఉదయం 11 గంటల దాటినా మంచు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు రాకపోకలు సాగించలేక తిప్పలు పడ్డారు. పొగమంచు పంట పొలాలపై కమ్ముకోవడంతో ఉన్న పత్తి పంట తడిసిపోయింది. - కెరమెరి

'ప్రజాపాలన' విజయవంతం చేయండి



రెబ్బెన: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రభాకర్

కెరమెరి: నేటి నుంచి జనవరి 6 వరకు నిర్వహించే ప్రజాపాలన విజయవంతం చేయాలని అడిషనల్ డీఆర్‌డీవో, ప్రజాపాలన మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి నుంచి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. వీటిని ప్రతిరోజు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య తదితరులు ఉన్నారు.

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం అన్ని ప్రభుత్వశాఖ అధికారులతో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజుకు 4 గ్రామాల చొప్పున గ్రామసభలు నిర్వహించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సమీర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

కౌటాల: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి గ్రామ సభలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో గ్రామసభ నిర్వహణకు ఒక్కో గ్రామ పంచాయతీకి ప్రభుత్వం రూ.10వేల చొప్పున నిధులు మంజూరు చేసిందని అధికారులు తెలిపారు. మండలంలో ఈ నెల 28న వీరవెల్లి, సాండ్‌గాం, బోదంపల్లి, కన్నెపల్లి, 29న పార్డి, ముత్తంపేట్, గురుడుపేట్, తలోడి, 30న శీర్షా, గుడ్లబోరి, మొగడ్‌దగడ్, తాటిపల్లి, జనవరి 2న కనికి, నాగేపల్లి, గుండాయిపేట్, తుమ్మిడిహెట్టి, 3న భాలేపల్లి, వీర్దండి, తాటినగర్, కౌటాల గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు.

దహెగాం: నేటి నుంచి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభం కానుందని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ బుధవారం తెలిపారు. గ్రామసభలో అర్హులు రేషన్‌కార్డు కోసం, ఇళ్ల మంజూరు, రూ.500లకు గ్యాస్ తదితర పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 28న ఐనం, లగ్గాం, పెసరికుంట, ఛౌక, 29న బీబ్రా, చంద్రపల్లి, కోత్మీర్, భామానగర్, 30న బొర్లకుంట, ఒడ్డుగూడ, ఇట్యాల, చినరాస్పెల్లి, జనవరి 2న దహెగాం, గెర్రె, కమ్మర్‌పల్లి, గిరవెల్లి, 3న హత్తిని, కర్జి, పీపీరావు కాలనీ, దిగిడ, 4న కుంచవెల్లి, మొట్లగూడ, రాంపూర్, కల్వాడ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దహెగాం: నేటి నుంచి అన్ని గ్రామాల్లో నిర్వహించే ప్రజాపాలన గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్‌లు అన్నారు. బుధవారం ప్రజాపాలన కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు.

కాగజ్‌నగర్‌టౌన్: ప్రజాపాలన అందించేందుకు గురువారం నుంచి జనవరి 6 వరకు గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వార్డు సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు దరఖాస్తులతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డులను జత చేసి అధికారులకు అందించాలని సూచించారు.

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి రైతువేదికలో ప్రభుత్వం నూతనంగా శ్రీకారం చుట్టిన ప్రజాపాలన పై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలకు, పంచాయతీ సిబ్బందికి మండల నోడల్ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో గంగాసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని వివిధ శాఖల అధికారులకు, సిబ్బందికి బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలనపై మండల ప్రత్యేక అధికారి సురేశ్ బాబు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అందేలా చూడాలని, సంక్షేమ పథకాల వివరాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. షీటీం ఇన్‌చార్జి శ్రీనివాస్ (ఏఎస్సై) ఆధ్వర్యంలో షీటీం బృందం స్థానిక ఆర్టీసీ బస్టాండ్, భట్‌పల్లి చౌరస్తా తదితర ప్రాంతాల్లో ప్రజలకు, మహిళలకు అవగాహన కల్పించారు. షీటీం పనితీరు, మహిళలు, యువతుల రక్షణ, ఫిర్యాదు చేసే విధానం, షీటీం హెల్ప్‌లైన్ నంబర్లు తదితర విషయాలపై వివరించారు. షీటీం సేవలను మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నవంబర్ వేతనాలు చెల్లించాలి

కాగజ్‌నగర్‌టౌన్: సమగ్రశిక్షలో పనిచేస్తున్న కేజీబీవీ సీఆర్టీ స్పెషల్ ఆఫీసర్‌ల వేతనాలు, మండల వనరుల కేంద్రంలో పనిచేస్తున్న ఎంఐఎస్, ఒసీసీఓ, సీఆర్టీ, ఐఈఆర్టీల నవంబర్ నెల వేతనాలు వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే వేతనాలు విడుదల చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

ఆటల్లో క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అజయ్‌కుమార్

వాంకిడి: క్రీడాకారులు ఆటల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో గంగరాజ్ భీమన్న దేవర, కుప్పాదేవి భీమన్న దేవర జాతర ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న కబడ్డీ క్రీడాపోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వినోద్, బీఆర్‌ఎస్ నాయకులు కమలాకర్, బాపురావు, మహాదు, దేవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన సర్పంచులు

నార్నూర్: మండల సమస్యలను పరిష్కరించాలని బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో వినతిత్రం అందజేశారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్, మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావులు మాట్లాడుతూ నార్నూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. తాడిహత్నూర నుంచి గాదిగూడ ఎల్లాపూర్ వరకు డబుల్ రోడ్డు, మండలంలోని మల్లెంగి, కొత్తపల్లి-హెచ్, ఎంపల్లి, మారప్పాగూడ గ్రామాల యందు చెరువుల నిర్మాణం చేపట్టాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు కనక ప్రభాకర్, మాడవి రూప్‌దేవ్, విష్ణు ఫడ్, రామేశ్వర్ రాథోడ్, గోపాల్ ఉన్నారు.

తుడుందెబ్బ డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా ప్రభాకర్

నార్నూర్: తుడుందెబ్బ డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని దుప్పాపూర్ గ్రామానికి చెందిన కనక ప్రభాకర్‌ను బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి స్ఫూర్తితో ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

నార్నూర్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని శ్రీమూర్తి రాములు ఆలయ పీఠాధిపతి శ్రీరాం మహరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని చోర్‌గావ్ గ్రామంలో శ్రీమూర్తి రాములు (శివాలయం) వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాపూజ, హోమం, ప్రత్యేక పూజలు చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, ఐక్యత సోదరభావాన్ని కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంఘం మండల కార్యదర్శి రాథోడ్ సావీందర్ పాల్గొన్నారు.